
ఎల్లోరా

# ప్రేమ లేఖలు



డబ్బు ఆనందాన్ని ఇస్తుందనుకొంటారు కొందరు! హోదా, ఆహ్లాదాన్ని ఇవ్వగలదనుకొంటారు మరికొందరు!

డబ్బూ, హోదా ఉండీ ఆనందానికి కరువై ఆహ్లాదానికి దూరమై, జీవితాన్ని వరుగెత్తిస్తూ ఉండే జీవితాల కథ వింటూంటే జాలికన్నా ఆశ్చర్యం కలుగుతుంది!

తన జీవితాన్ని తలుచుకుంటూ కుర్చీలో వాలిన డాక్టర్ సుధ అదే అనుకుంది. సంఘంలో డాక్టర్‌గా హోదా ఉంది-ధనముంది-భర్త పెద్ద ఆఫీసరు అయితేనేం ఒక్కటేలేదు-అది తీరిక-ఆనందం!!

సాయంత్రం హాస్పిటల్ నుంచి వచ్చిన సుధ అలసటగా హాలులో

కుర్చీలో కూలబడి, స్టెతస్కోపుని ముందరఉన్న టేబుల్‌మీద పడేసింది. నిండుగా ఒక శ్వాస తీసుకుని చేతులను తలవెనుకగా పెట్టుకొని — వెనక్కు వాలింది

ఎదురుగాఉన్న కిటికీలోంచి రెండు పిచుకలు కిచకిచలాడుతూ హాలులోకి వచ్చి, హాయిగా ఆనందంగా ఓ నిముషం గెంతి అంతలోనే తుర్రుమన్నాయి.

ఆ పిచుకల జంటను చూస్తూన్న సుధలో తను చిన్నతనంలో కట్టిన పిచ్చుక గూళ్లు, అలా నిర్మించిన ఇసుక గూళ్లను గురించి ఆలోచిస్తూ మురిసి పోయిన క్షణాలు మధురస్మృతులుగా కళ్లముందు కనిపిస్తున్నాయి - ఆ దృశ్యాన్ని చెరిపేస్తూ పనిపిల్ల రాధి ట్రేలో కాఫీపట్టుకువచ్చి సుధకు ఇచ్చింది.

ఆవిరులు కక్కుతూన్న కాఫీ కప్పును అందుకొని సిప్‌చేసి, "పిచుకల జంటకు ఉన్న పాటి ఆనందం గర్వం మనకు లేదు" అంది రాధికి చెబుతూన్నట్లు.

'ఏటమ్మగోరు-పిచుకల జంట అంటున్నారు' అంది ఏ విషయం అర్థంకాని రాధి.

'అదేనే-ఆ కిటికీలోంచి రెండు పిచుకలు వచ్చి కాసేపు ఎగిరి ఆనందంగా వెళ్లిపోయాయి-వాటికి అలసటా లేదు- అడ్డూలేదు — అంటూ కాఫీ త్రాగేసింది.

కాఫీ కప్పుని తీసుకుని రాధి లోపలికి వెళ్లిపోయింది.

హాలులోఉన్న ఫోన్ మ్రోగగానే రాధి పరుగెత్తుకునివచ్చి ఫోన్‌తీసి 'అమ్మగోరూ ఆసుపత్రినుంచండి' అంది.

సుధ అందుకుంది-రాధి తిరిగి వెళ్ళిపోయింది.

"హలో! సుధని మాట్లాడుతున్నాను."

........................

"రోగికి ధైర్యం చెప్పు."

........................

"ఆఁ! భయంలేదు."

"ఓ.కె."

ఫోన్ పెట్టేసి వచ్చి కుర్చీలో కూర్చుంది.

'అబ్బబ్బ! ఒక్కసారి కూర్చోనివ్వరు-ఏం బ్రతుకో' - అనుకొంది స్వగతంగా సుధ.

'అమ్మా, నీళ్లుతొరిపా - పోస్సుకోండి' అని చెప్పి తువ్వాలు పట్టుకుని వెళ్లింది రాధి.

సుధ లేచి స్నానానికి వెళ్ళింది.

విజయ్ ఆఫీసునుంచి వచ్చాడు- హాలులో కూర్చుని టై విప్పుకొంటున్నాడు.

విజయ్ వచ్చాడని గ్రహించిన రాధి కాఫీ పట్టుకుని వచ్చింది. కాఫీ అందుకుని సిప్‌చేసి 'సుధ వచ్చిందా!' అని అడిగాడు.

'స్నానం చేస్తున్నారు.' చెప్పి కాఫీ కప్పు తీసుకుని వెళ్లిపోయింది రాధి

విజయ్‌లో అలసట ముఖంనిండా

కొట్టవచ్చినట్లుగా కనిపిస్తుంది. ఎదురుగా ఉన్న టేబుల్‌మీంచి పత్రిక ఒకటి అందుకుని చదువుతూన్నాడు.

అలాగే ఇరవై నిముషాలు గడిచిపోయాయి. సుధ చీర మార్చుకొని, ఫ్రెష్‌గా భర్త విజయ్ వచ్చాడన్న ఆనందంతో సిగలో మల్లెలు తురుముకుంటూ వచ్చింది.

నిండుగా నవ్వుతూ 'వచ్చారా?' అని పలకరించి పక్కన కూర్చోబోతూండగా ఫోన్ మ్రోగింది. ఫోన్ అందుకున్న సుధ—

"పెయిన్‌గా ఉంటే బెరాల్గిన్ వెయ్యి."

"........."

"అవును ఆయన ఇప్పుడే వచ్చారు- నేనూ ఇప్పుడే కాస్త..."

'ఆఁ అయితేవస్తున్నా. ఆ పిల్లని భయపెట్టవద్దు-భర్త వస్తే ఉండమను'... చెప్పి విసుగ్గావచ్చి భర్త విజయ్‌పక్కన కూర్చుంది సుధ.

చదువుతూన్న పత్రికను పక్కనపెట్టి "చాలాకాలం తర్వాత ఇద్దరం సాయంత్రము ఇంటికిరాడం కలుసుకోడం జరిగింది కదూ" అంటూ సుధని చూస్తూన్నాడు

''అలా కొత్తమనిషిని చూస్తున్నట్లు చూస్తున్నారు—నేను...''

సుధ మాటకు అడ్డువచ్చి విజయ్ "ఈ రోజు నువ్వు చాలా ఫ్రెష్‌గా కనిపిస్తున్నావ్. ఆ చీర, సిగలో మల్లెలు చూస్తుంటే మన పెళ్ళి జరిగిన మొదటి దినాలు గుర్తుకు వస్తున్నాయి'' అని బుగ్గమీద చిటిక వేయబోయాడు.

తప్పించుకొంది సుధ. చిన్నగా నవ్వింది. "చాలా అలసట కనిపిస్తుంది ముఖంలో-అంతపనాఆఫీసులో?" అంటూ ముందుకుపడ్డ క్రాప్‌ని సవరించింది సుధ.

సుధ కళ్ళలో తన కోర్కెల నీలినీడలను వెతుక్కోసాగాడు విజయ్.

'అమ్మగోరండి. అయ్యగోరికి నీళ్ల తొరిపానండి' చెప్పి రాధి.వెళ్ళిపోయింది.

"స్నానం చేయండి. కాస్త అలసట పోతుంది. టిఫిన్ చేదాం" అంటూ లేచింది సుధ.విజయ్ స్నానానికి బయలుదేరాడు.

'నమస్కారం' అంటూ పాతిక సంవత్సరాల యువకుడు హాలులోకివచ్చాడు.

వచ్చిన యువకునిచూసి డాక్టర్ సుధలో కాస్త విసువు కనిపించింది. ఓ పది నిముషాలన్నా విశ్రాంతిలేదు. భర్తతో కలిసి కూర్చోడానికి లేదు-అనుకొంది.

"ఆసుపత్రినుంచి వస్తున్నానండి." తిరిగి తనే అన్నాడు.

"ఏమిటి విషయం?"

"ఆసుపత్రిలో నిన్న చేర్చినఅమ్మాయి లక్ష్మి భర్తనండి..."

"ఓ! నువ్వా? కూర్చో-ఏమిటి మీ ఆవిడకి?"—

''హిస్టీరియా అంటున్నారు. కాని..." ఏదో చెప్పాలని, చెప్పలేక డాక్టర్ సుధని

దీనంగా చూస్తూ ఉండిపోయాడు.

"ఏదో ఆలోచిస్తున్నా వేమిటి. చెప్పు"- ధైర్యం ఇచ్చింది సుధ.

"అసలు కథ ఇదండీ–లక్ష్మిని మోసగించానండి" అంటూ కన్నీరు పెట్టుకొన్నాడు.

"డాక్టర్‌గా నేను అన్ని విషయాలూ నా కడుపులో పెట్టుకొంటాను - అన్ని విషయాలూ చెప్పు'.

"మాకు పిల్లలు లేరు. అదే లక్ష్మికి బాధ. ఆ బాధతో మనసు పాడుచేసుకొంటూంది. ఇక మాకు పిల్లలు కలగరు డాక్టర్. పిల్లలు కలిగే అదృష్టం మాకులేదు"–తలమీద చేతులు పెట్టుకొని బావురుమని ఏడ్చాడు.

సుధ లేచి, యువకుని దగ్గరగా వెళ్ళి భుజం తడుతూ "నేను ఉన్నాను–మీకు అన్నివిధాలా సాయపడతాను. బాధ పడకు. రా నాతో" అంటూ హాలులోంచి యువకుని తనతో పక్కనే ఉన్న కన్సల్టింగ్ రూమ్‌లోకి తీసుకుపోయింది సుధ.

సుధ అలా వెడుతూంటే విజయ్ డ్రస్ చేసుకుని 'సుధా' అంటూవచ్చాడు. ఆ వెనకాలే రెండు ప్లేట్లలో టిఫిన్ ట్రేలో పట్టుకువచ్చింది. టేబుల్‌మీద ప్లేట్లు పెట్టి 'వాటర్' తెస్తానంటూ వెళ్ళిపోయింది రాధి.

టేబుల్‌మీద టిఫిన్ ప్లేట్లు చూస్తూ సుధ వస్తుందని ఎదురుచూస్తూ కూర్చున్నాడు విజయ్.

గదిలో కూర్చోపెట్టి అన్నీ అడిగింది ఆ యువకుడ్ని సుధ.

"అరవై రూపాయలు ఇస్తారు. వాసెక్టమీ చేయించుకుంటే–అని ఒక అతను నన్ను మోసగించాడు బీదతనం డబ్బు అవసరంతో ఆ నాడు పెళ్ళి అయిందనీ, పిల్లలనీ ఏవేవో అబద్ధాలు చెప్పి డబ్బు కోసం ఆపరేషన్ చేయించుకొన్నాను"- అంటూ మహాపరాధిలా నిలబడ్డాడు.

"ఎంత పొరపాటు చేశావు? నిన్ను ఎలా ప్రోత్సహించారు?? ఇదన్నమాట లక్ష్మికి మనోవేదన–సరే, నువ్వు రేపు ఉదయం హాస్పిటల్‌కువచ్చి నన్ను కలుసుకో". చెప్పి ఆ యువకుని పంపేసింది.

'సైన్స్ మానవునికి ఎంత సహాయపడుతుందో, అంత పరీక్షగా కూడా తయారయింది భగవాన్! ఈ యువ దంపతులమధ్య ఈ పరీక్ష ఏమిటి' అనుకొంటూ హాలులోకి వచ్చింది సుధ.

"సారీ! మీరు నా కోసం వెయిట్ చేస్తున్నారా? మీరు తీసుకోండి టిఫిన్. ఫోన్ చేసివస్తా" అంది భర్త విజయ్‌తో సుధ.

విజయ్ చాలా బాధపడ్డాడు, ఈ మాటతో. 'స్నానంచేసి, డ్రెస్‌మార్చుకొని వచ్చి సుధతో ఈ రోజైనా టిఫిన్ చేస్తూ కబుర్లు చెప్పుకుందామనుకున్నాడు –అయితే, ఈ రోజూ సుధకు తీరిక లేదు - ఎలా ఉంటుంది పాపం ఆవిడ



పెద్ద డాక్టర్' మనసులో విసుగు, అసంతృప్తి మెరిసింది.

సుధ ఫోన్‌లో లక్ష్మిని గురించి మాట్లాడి వచ్చింది. "విజయ్" అంటూ వెనక్కు తిరిగిచూస్తే భర్త టేబుల్‌వద్ద లేడు. మనసులో బాధ కలుక్కుమంది.

రాధి కాఫీలు పట్టుకు వస్తూంటే "ఆయన ఏరీ?" అని అడిగింది సుధ,

"నేనిప్పుడేకదా వస్తూంట, నాకు తెలియదమ్మా" అని సమాధానంఇచ్చి తినకుండా అలానే ఉన్న టిఫిన్ ప్లేట్లను ఆశ్చర్యంగా చూస్తూ నిలబడిపోయింది రాధి. రాధినీ, కాఫీనీ, టిఫిన్ ప్లేట్లనీ చూస్తూ "జీవితం" అనుకొంది గదిలో వున్నాడేమో భర్త అని అటు వెళ్లింది.

భార్యకోసం చూసి చూసి, విసుగు చెందిన విజయ్ అసంతృప్తిని తింటూ ఎప్పుడో బైటకు వెళ్ళిపోయాడన్న సంగతి ఇప్పుడుగాని సుధకు తెలియ లేదు.

"రాధీ! టిఫిన్ పేట్లూ, కాఫీలూ పట్టుకుపో". చెప్పి సుధ కన్నీటిని దాచు కోడానికి గదిలోకి వెళ్ళిపోయింది.

'టిఫిన్‌చేయడానికి తీరికలేదు. ఏవిటి బ్రతుకులో' అనుకొంది. పెద్దవాళ్ళ బ్రతుకులను పెద్దగా ఊహించుకొనే చిన్న బ్రతుకు బ్రతికే రాధి.

* * *

విజయ్, సుధలకు వివాహం అయి రెండు ఏళ్లు పూర్తయింది. పెళ్ళి అయిన రోజు ఇద్దరూ అలా అలా తిరిగి ఆనందంగా గడపడం పరిపాటి. ఆ రోజు మాత్రం ఎన్ని పనులున్నా మానేసి సినిమాకి వెళ్ళి, హోటల్‌లో భోంచేసి పొద్దుపోయాక కన్న కలల్ని పండించు కోడానికి ఇల్లు చేరేవారు. ఆ రాత్రి సుధలో స్వర్గాలు చూసేవాడు విజయ్. ఆ రాత్రి విజయ్‌లో ఆనందలోకాలు దర్శించేది సుధ!

ఈ రోజు మూడో సంవత్సరం. ఎప్పటిలాగే సుధ అన్ని ఏర్పాట్లూ చేసి వివాహ వార్షిక వేడుక జరుపుకోడానికి విజయ్ కోసం ఎదురుచూస్తూ కూర్చుంది. ఇప్పుడే వస్తానని వెళ్ళిన భర్త ఎంతకీ రాలేదు.

విజయ్‌మీద కోపం ముంచుకు వస్తూంది సుధకి. ఇంకా రాడేమా అని ఆతృత ఎక్కువయింది. ఫోన్ కాల్ వచ్చింది. తీరా అది పేషెంట్‌కు సంబంధించింది. తిరిగి కిటికీలోంచి ప్రకృతిని చూస్తూ కూర్చుంది. మేఘాల పరదాలలో తను దాగి విజయ్‌తో దోబూచులాడుతున్నట్లు మనసులో ఏవేవో ఊహలు, ఆలోచనలు—ఆలోచనలను అరికడుతూ మళ్ళీ ఫోన్‌కాల్.

ఇప్పుడు చాలా విసుగూ – కోపం వచ్చింది సుధకు. అందుకుంది–ఆనందం వెల్లువికింది — కారణం విజయ్. "హలో!"_ అంటూ ఆతృత పడింది.

"సుధా! ఈ రోజు ఆఫీసులో చెకింగ్—పై ఆఫీసర్ వచ్చాడు– ఒక్క క్షణం తీరికలేదు. తప్పించుకొందామని ప్రయత్నించా. ఏమనుకోకు– రేపు సెలబ్రేట్ చేసుకొందాం". విజయ్ **ఫోన్‌లో** చెప్పాడు.

"రేపు" అనుకొంటూ నిరుత్సాహంగా గదిలోకి వెళ్ళి అలంకరణ తీసి పారేసి–మంచంమీద వాలింది సుధ.

* * *


విజయ్‌కి వీలుచిక్కిన సమయాలలో సుధ అవసరంగా కేసులు చూడాలని ఆసుపత్రికి పరుగెత్తడం, సుధకు కాస్త వెసులుబాటు దొరికినప్పుడు విజయ్ ఆఫీసు ఫైళ్ళలో తలదూర్చడంతో జీవితాలు యంత్రాలులాగా కనిపించ సాగాయి.

ఈ ఆలోచనలు ఇద్దరినీ కలచివేసినా వీళ్ళకోసం కాలం ఆగదు—కాలచక్రం తిరుగుతూనే ఉంది.

ఇలాటి వాతావరణంలో ఒకనాడు—



యువ




సుధ రోగిని చూస్తూంది— మనసూ అంతగా బాగాలేదు. ఇంట్లో ఎవరు ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెడతారో— ఇద్దరినీ ఒకేసారి చూడడం పనిపిల్ల రాధికీ వీలుపడడంలేదు - ఎవరు వస్తారో వారికి కాఫీలు, టిఫిన్‌లు, భోజనాలు, స్నానాలూ అమర్చడం తప్ప మరేంఅడగదు రాధి-అడిగే అధికారమూ లేదు.

సుధకు సంఘంలో సమాజంలో డాక్టర్‌గా, పెద్ద ఆఫీసర్ భార్యగా మంచి పేరూ ఉంది, పలుకుబడీ ఉంది-కాని ఆఫీసర్‌గారి భార్యగా తాను అనుభవిస్తూన్న ఆనందం ఎంత? దీనితో సంఘానికి సంబంధం లేదు,

ఓ పక్క ఈ ఆలోచనలు సుధని వేధిస్తూన్నాయి- రోగిని పరీక్షిస్తూన్న సుధకు చికాకు కలిగింది-కారణం-నర్స్ విరగబడి నవ్వుకొంటూంది ... ఏదో ఉత్తరం చదివి మురిసిపోతూంది.

బాధలతో బరువులతో నిండినవారికి నవ్వూ, పువ్వూ, వెన్నెలా-అన్నీ చికాకుగానే ఉంటాయి.

రోగిని పంపేసి కుర్చీలో కూర్చుంది సుధ.

నర్స్ పద్మ వారానికో పదిరోజులకో ఓ సారి ఇలా నవ్వుతూ మురిసిపోతూ ఉండడం, ఆ ఉత్తరాన్ని ఒకటికి నాలుగుసార్లు చదువుకుని ఆనందించడం పద్మ గమనిస్తూనే ఉంది - అంతగా

పట్టించుకోలేదు గతంలో—అది అంత పట్టించుకొనేలా అనిపించలేదు—మరి—ఏమో తనకే తెలియదు—చిన్న ఉద్యోగి నర్స్- అయితేనేం ఎంత హుషారు, ఎంత ఆనందం, మరెంత సంతృప్తి. మరి—అన్నీ ఉన్న నాకు ఆ ఆనందం, ఆ హుషారు—కనిపించవేం? మనసులో ప్రశ్నలు-దొరకని సమాధానాలు!

పద్మని పిలిచి ఆ ఆనందానికి కారణం ఏమిటని అడిగితే? చ! మన అంతస్తేమిటి? దానిఅంతస్తేమిటి? అలుసుఅయిపోమూ! తనలో తనకే అనుమానాలు!

ఈ నిర్ణయం ఆట్టేసేపు నిలవలేదు. అప్రయత్నంగా లేచి నర్స్ పద్మవద్దకు వెళ్లింది.

"డాక్టర్" అంది ఉత్తరాన్ని దాచుకొంటూ.

"కూర్చో పద్మా! నేను డాక్టర్‌గా కాకుండా నీలాంటి సామాన్యమనిషిగా ఒకప్రశ్న అడుగుతా. సమాధానం చెబుతావా?" దీనంగా అడిగింది సుధ.

"డాక్టర్! ఏమిటో మీరు కొత్తగా మాట్లాడుతున్నారు! ఆశ్చర్యపోతూంది పద్మ.

"అవును పద్మా! నా మాట నీకు కొత్తగా వినిపిస్తూందికదూ. నిజం, అడగమంటావా?"—

నర్స్ మనసు పరిపరివిధాల పోతూం:. డాక్టర్ ఏమిటి? తననేమిటి సామాన్యమనిషిగా ప్రశ్న అడుగుతానడం ఏమిటి? భయంగానూ ఉంది పద్మకు, ఆశ్చర్యంగానూ ఉంది!

"చెప్పండి డాక్టర్" అంది భయపడే గొంతుకతో.

"ఏంలేదు పద్మా! చాలాకాలంగా చూస్తున్నాను..."

"ఇకముందు అలాంటి పనులుచెయ్యనంది. క్షమించండి డాక్టర్" — నర్స్ తన పనిలో ఏదో లోపం ప్రవర్తనలో ఏదో వంకచూసి హెచ్చరించబోతున్నారని అనుమానించి క్షమాపణలు చెప్పకొంది.

పద్మ భుజాన్ని తట్టి "భయపడకు పద్మా నువ్వు. పనిలోకాని, బాధ్యతలలో గాని, ప్రవర్తనలోగాని ఏ పొరపాటూ చెయ్యలేదు-నేను అడిగేది విను"-అంటూ పద్మను పరికించింది సుధ.

"థ్యాంక్స్ డాక్టర్" అని ఊరుకుంది పద్మ.

"అప్పుడప్పుడు నీలో నువ్వు ఏదో ఉత్తరం చదువుతూ నవ్వుతావు. ఆ ఉత్తరం చదివిన రోజున నీలో ఉత్సాహం, హుషారు కనిపిస్తూంటుంది. అది నేను తెలుసుకోకూడదా?"-

డాక్టర్ సుధ అడిగిన ఈ ప్రశ్నకు పద్మ ఆశ్చర్యపోయింది.

"పెర్సనల్ డాక్టర్" అంది పద్మ.

"సీక్రెట్ అయితే వద్దులే - సారీ!" సుధ అంది.

అంత పెద్ద డాక్టరువచ్చి అడిగితే

పెర్సనల్ అంటే మంచిది కాదేమో అని పించింది, అంతలోనే పద్మకి. "చూడండి డాక్టర్! పెన్ ఫ్రెండ్ రాసిన ఉత్తరాలు నన్ను అలా మురిపిస్తుంటాయి. ఆ ఉత్తరాలు నన్ను మత్తెక్కించి, అలా అలా ఏదో లోకాలకి చెయిపట్టుకుని లాక్కుపోతుంటాయి." అని, తనలో తానే నవ్వుకొంది పద్మ,

"కంగ్రాచ్యులేషన్స్ పద్మా! పెట్టి పుట్టడం అంటే ఇదే అనుకుంటా. ఉత్తరాలలోని అక్షరాలే నీ మనసుని ఇంతగా ఆకట్టుకొన్నాయంటే నిజంగా ఆ హృదయం నిన్ను పలకరిస్తే మరెంతగా ఉంటుందో" అంటూ పద్మ బుగ్గమీద గిల్లింది చనువు తీసుకుని డాక్టర్ సుధ.

గర్వంగా నవ్వింది పద్మ — ఆ నవ్వులో "ఇది నేను సాధించుకొన్న అదృష్టపు ఆనందం" అన్నట్లు ఉంది.

ఏదో ఆలోచిస్తూంది సుధ.

"టైం అయింది, ఇంటికి వెళ్లరా డాక్టర్–అడిగింది నర్స్ పద్మ.

"ఏమిటో నీతోనే ఇలా మాట్లాడుతూ ఉంటే బాగుంటుందనిపిస్తూంది పద్మా - ఒక్క త్యాగం చెయ్యగలవా?"

"త్యాగమా డాక్టర్?"

"అవును పద్మా! నీ ఆనందం, ఉత్సాహం నాకు ఈర్ష్య కలిగించడం లేదు-కాని, ఆ ఉత్తరాల్ని చదివి, నాలో నేను ఆనందించే భాగ్యం అయినా నువ్వు నాకు కలిగించలేవా" — చేతులు పట్టుకుంది సుధ.

బెంబేలుపడింది పద్మ. "కొంపతీసి ఉత్తరాలు బజారుకెక్కుతే? "...అని!

"పద్మా! నాకు తెలుసు. ఇది నీ స్వవిషయం అనీ, సీక్రెట్ అనీ...నేను చదివి మరిచిపోతా. ప్లీజ్" ... చేతులు పట్టుకుంది సుధ.

"చేతులు వదలండి డాక్టర్. మీరు..." ఒణికిపోతూ అంది పద్మ.

"ఇస్తావా పద్మా?" అన్నట్లు బేలగా చూస్తూంది సుధ.

ఒక్కనిమిషం ఇవ్వడమా, మానడమా అని ఆలోచించింది. ఆమె తనకన్నా సుపీరియర్, తను ఆమె ఆదరాభిమానాలతో ఉద్యోగం చేసుకోవాలి. అంతగా అడుగుతూంటే ఇస్తేనే మంచిది ఒక...నిర్ణయానికి వచ్చింది.

"అన్నీ చూస్తారా డాక్టర్?" నవ్వుతూ అడిగింది పద్మ.

"ఊఁ!" తల ఊపింది నిండుగా సుధ.

డ్రాయర్ తెరచి ఒక ఫైలులో నెంబరు, దేటువారీగా పెట్టుకున్న లేఖలను సుధకు అందించింది- "ఇవి ప్రాణం డాక్టర్" అంది

ఆ మాటలో ఎంత నిండుతనం, గర్వం—అన్నింటినీ మించి ఆనందం ఉందో పద్మకే తెలియాలి.

ఉత్తరాలు చదువుకొంటూ కుర్చీలో కూర్చుంది డాక్టర్ సుధ.

ఆ సమయంలో పక్కన ఉండడం మర్యాదకాదని నర్స్ పద్మ దూరంగా వెళ్లిపోయింది.

ఆ ఉత్తరాలు చదవకంలో పరిసరాలనే మరిచిపోయింది సుధ ప్రారంభంలో సుధ ఒక నిర్ణయం తీసుకుని ఉత్తరాలు చదవాలని అనుకొని ప్రారంభించింది- 'నవ్వకూడదు' అని !

క్షణాలుగడిచేకొలదీ సుధకు తెలియ కుండానే మనసు ఆనందంతో గెంతులు వేస్తూంది - నాలుగు ఉత్తరాలు చదివి, ఐదో ఉత్తరం ప్రారంభించింది...ఆ మాటలు – కొంటెతనం - నవ్వలేకుండా ఉండలేకపోయింది.

పకపకా నవ్వుకొంటూంది సుధ.

"డాక్టర్ ! మీకూ కితకితలు పెడు తున్నాయా ఆ ఉత్తరాలు ?" అంటూ వచ్చింది పద్మ.

పద్మ అలా అంటూంటే ఏడవాలో నవ్వాలో తెలియలేదు సుధకు-నవ్వ కూడదనుకొన్నా నవ్వువచ్చింది. అయినా ఇందులో ప్రిస్టేజి ఏమిటి. వెన్నెల, చల్ల గాలి, ప్రకృతి అందరికీ సమానమైనవి.

"పద్మా! నిజంగా ఎదురుగా నిలబడి కవ్విస్తూన్నట్లు, కొంటెతనంతో అల్లరి చేస్తూన్నట్లు..." ఆ ఉత్తరాలని గుండె లకు అద్దుకొని కళ్లు మూసుకుంది సుధ.

"డాక్టర్" అని పద్మ పిలిచేదాకా కళ్లు తెరవలేదు సుధ.

"పద్మా — మొదటి ఉత్తరాలలో సాహిత్య చర్చ, సాంస్కృతిక చర్చలూ అభిరుచులూ వున్నాయి. రాను రాను మీ కలం స్నేహం..."

సిగ్గుతో తలవంచింది పద్మ !

"పాపం అమ్మాయిగారికి అంత సిగ్గైతే, ఉత్తరాలు ఎలా రాస్తున్నారో" అంటూ చనువు తీసుకుని నెత్తిమీద మొట్టింది సుధ.

"అబ్బా !" అంటూ కొంటెగా పెది మలు నొక్కుకుంది పద్మ.

"డాక్టర్ ! ఉత్తరాలు చదువు తూంటే..."

"ఊఁ ! చదువుతూంటే ... ??"

"మీకు ఏదోలా అనిపించలేదా ?"– పద్మ అడిగింది.

ఫక్కున నవ్వింది సుధ.

"పద్మా ! నాకు ఏదోలా అనిపించ లేదు కాని..."

"చెప్పండి డాక్టర్? కాని ... "

ఆతృతగా మీదకు వంగింది పద్మ.

"నాకు ఉత్తరాలు చదువుతూంటే- నాకు ఏదో ఇదిలా అనిపించింది"-అని కొంటెగా పద్మని చూసింది సుధ.

"ఇది అంటే ?" గారంగా అడిగింది పద్మ.

"ఆ ఉత్తరాలు చదువుతూంటే నీకు ఉంటుందే అది అన్న మాట"—

ఇద్దరూ పకపక నవ్వుకొన్నారు.

"వస్తా పద్మా—థ్యాంక్స్" అంటూ లేచింది డాక్టర్ సుధ.



"డాక్టర్..." పక్కగా నిలబడింది పద్మ.

"ఏమిటి పద్మా!"

"ఏమనుకోరు కదా?"

"నిన్నను అయితే అనుకొనేదాన్నేమో కాని, ఈ రోజు అనుకోను- చెప్పు?"

"మీలో ఏదో అసంతృప్తి గూడు కట్టినట్లు, ఏదో వస్తువు పారేసుకున్నట్లు అలసటగా, సీరియస్‌గా, బిజీగా కనిపించేవారు. ఇన్నాళ్లకి మీ ముఖంలో ఓ మెరుపులాంటి నవ్వు, విరిసిన పువ్వులాంటి మీ ముఖారవిందం చూశాను — ఏమనుకోకండి డాక్టర్ ఉండబట్టలేక అనేశాను, అడిగేశాను".

"నిజాలు చేదుగా ఉంటాయంటారు పద్మా. నువ్వు చెప్పిన నిజం నిజంగా తియ్యగా ఉంది. ఏమనుకోను...పద్మకి సైకాలజీ బాగా తెలుసునని ఇప్పుడే అనుకొంటున్నాను.

"థ్యాంక్స్ డాక్టర్" అంది పద్మ.

"కలం లేఖలు ప్రేమలేఖలుగా మారి

నట్లున్నాయి-మరి మాకు పెళ్ళి భోజనం ఎప్పుడు పెట్టిస్తావు" భుజంమీద చెయ్యి వేసి నడుస్తూనే అడిగింది సుధ.

"డాక్టర్ !" అంది ఏదో బాధగా పద్మ.

"ఏం! ఏం జరిగింది. సుధ ఖంగారు పడుతూ అడిగింది.

"వద్దు డాక్టర్. కొన్ని నిజాలు తెలియకుండా వుండడమే మంచిది. కొన్ని విషయాలు మన చెవిని పడకుండా వుంటేనే అందం" ... నిరుత్సాహంగా పద్మ అంది.

"ఏమిటి పద్మా ! నో ఫియర్—ఏం జరిగిందేమిటి ?"

"అతనికి పెళ్ళి అయింది, కాని..."

"తర్వాత...?"

"ఆమె పెద్ద హోదాలో ఉందిట. ఆయనా పెద్ద హోదాలో ఉన్నారట.

"గుడ్ ! గొడవేలేదు" -

"ఏమిటి డాక్టర్ గుడ్ ? నేను ఆ ఉత్తరాలు చదివి మమకారాన్నీ ప్రేమనీ పెంచుకొని, ఆ ఉత్తరాలలోని హృదయానికి నా గుండెలో గుడికట్టి ఆరాధిస్తూన్నాను. పెళ్ళిచేసుకోవాలని నిశ్చయించుకొన్నాను. తీరా..."

"ఏం! ప్రేమలు వేరు. సంసార జీవితాలు వేరు-దేనికదే".

"అంత సులువుకాదు డాక్టర్. మీరు సహిస్తారా ? లేరు ! కారణం? స్త్రీ హృదయంలో అంతమందికి స్థానంలేదు - దొరకదు - ఇద్దరు !!" — ఆవేశంగా అంది పద్మ.

"మరి ఏం నిర్ణయించుకొన్నారు ?"


"అతడికి భార్యలో అందం కనిపిస్తుందట. కాని ప్రేమ, ఆనందం హుషారు కనిపించవట. కొంచెతనపు సింగారం అసలుఅగుపించదట. అందుకే పద్మలోని 'అది' ఆయనగారికికావాలట. ఇస్తావా ? దోచుకోమంటావా ?" అని ఆఖరి ప్రేమలేఖలో రాశాడు.

"ఏనాడో దోచుకొన్నాడుగా ... ఇంకెందుకు ఈ దోబూచులాటలు—ఊరింతలు ? వెళ్ళు, ఆనందలోకాలకు ఇంద్రధనువుమీద గర్వంగా కూర్చుని వెళ్లండి "-సలహా ఇచ్చింది సుధ.

సిగ్గుపడుతూ కాలిగోటితో నేలను రాస్తూ చెప్పాలని అనుకొన్న విషయాన్ని చెప్పలేక పెదాలలో బలవంతంగా దాచుకొనే ప్రయత్నం చేస్తూంది పద్మ ?

రెండుచేతులూ పట్టుకుని పద్మని ఊపుతూ "చెప్పు పద్మా – తియ్యని కబురా, కమ్మని కబురా, వెచ్చని మాటా" అని అడిగింది సుధ.

"ఇద్దరం బృందావన్ హోటల్‌లో రేపు సాయంత్రం ఆరుగంటలకు కలుసుకొని, మా ఆనందాన్ని ఇతరులు ఎవరూ బెల్లిపించుకుపోకుండా పెనవేసుకోవాలనీ, ప్రేమలేఖల పందిరిలో పిచుకల జంటలా ఆడుకోవాలనీ నిర్ణయించుకొన్నాం




డాక్టర్ — మీ ఆశీస్సులూ లభించాయి కనుక రేపు హాయిగా వెడతాను డాక్టర్".

కళ్ళు ఒత్తుకుంటున్న డాక్టర్ సుధని చూసి పద్మ బేజారుఅయింది.

"ఏమిటి డాక్టర్ ?"

"ఇ౨ ఆనంద బాష్పాలు పద్మా— విష్‌యూ బెస్టాఫ్ లక్" — తలమీద చేయి ఉంచి ఆశీర్వదించింది సుధ.

"ఈ సమయంలో నాకేం బహుమతి లేదా ?" క్రీగంట చూస్తూ సుధ అడిగింది.

"ప్రెజంటేషన్ !!!" - అనుకొంది గట్టిగా పద్మ !

"అడగనా ?" - రెట్టించింది సుధ !

"అడగండి డాక్టర్ !" నవ్వుతూనే అంది.

"ఆ ప్రేమలేఖలు" నా కివ్వు! భయపడకు. నేను అంత స్వార్థపరురాలిని కాను. వాటిని చక్కగా బౌండు చేయించి, రేపు మీరు కలుసుకొనే బృందావన్‌లో- కలుసుకొన్న మధుర క్షణంలో బహుమతిగా ఇస్తా. ఈ ఒక్క కోరికా ..." చెయ్యి చాపింది సుధ.

చేతిలో చెయ్యివేసి "సరే డాక్టర్ ! ముందే మీరు ఆ గదిలో ఉంటే అతడు ఏమైనా అనుకోవచ్చు, సిగ్గుపడవచ్చు. నేను వెళ్ళి అతడ్ని కలుసుకొన్న అనంతరం మీరు రండి. నా శ్రేయోభిలాషి వచ్చి మనకు 'ప్రేమకానుక' ఇస్తారనీ కూడా ముందే చెప్పి ఉంచుతా" అంది పద్మ.

ఆ ఉత్తరాలు అన్నీ తీసుకుని సుధ "రేపు బృందావన్‌లో రాధామాధవుల్ని

కలుసుకుంటా-" అంటూ వెళ్ళిపోయింది.

వె డుతూన్న సుధనే చూస్తూ అలా నిలబడింది పద్మ.

*    *    *

అరుగంటల సమయం! వాతావరణం చాలా ఉల్లాసంగా ఉంది. పక్షులు రెక్కలు విప్పుకొని ఎగురుతూ హాయిగా ఆడుకొంటున్నాయి. ఎటు చూసినా సాయం సంధ్య కొత్త అందాలను అద్దుకొని వింత వింత శోభలతో ఆనందాన్ని పంచిపెడుతూంది. ఆడా మొగా గుంపులుగుంపులుగా జంటలు జంటలుగా వాహ్యాళికి వెడుతున్నారు.

కొంచెం అటూ ఇటూగా పద్మ బృందావన్‌కు వచ్చి ప్రియునికోసం ఎదురుచూస్తూ కూర్చుంది గదిలో.

ఎవరి కాలినడక చప్పుడు వినిపించినా ప్రియుడేనన్న భ్రమ. రాడేమో అన్న అనుమానం. వస్తున్నాడన్న ఆతృత— పద్మలో ఆనందం రాజ్యం ఏలుతూంది.

తలుపు చప్పుడయింది! ఆశతో తలుపుతెరచింది. సిగ్గు తో తొలి వలపుల సింగారాలతో తలవంచుకుంది.

దగ్గరగా వచ్చాడు-"నీ ఉత్తరాలలో నేను ఊహించినట్లే ఉన్నావు. సిగ్గు ఎందుకు-రా, దగ్గరగా, సూటిగా నా గుండెల్లోకి వచ్చెయ్యి" అంటూ అమాంతంగా పద్మని తన ఒడిలోకి తీసుకుని కళ్ళలో చూపులుపెట్టి ఉత్తరాలలోని అనుభూతుల్ని తలుచుకొంటున్నాడు.

అలా ఒకరిలో ఒకరు లీనమై— కోర్కెల అనురాగాలను, కమ్మని అనుభూతులనూ జంటగా అల్లు కొంటున్నారు.

కాస్త దూరంగా జరిగి మంచంమీద కొంటెనవ్వులు వర్షిస్తూ కూర్చుంది పద్మ.

గోడవైపుకు తిరిగి సిగరెట్టు ముట్టించి, మండుతూన్న అగ్గిపుల్లని చూ స్తూ ఏ దో చె ప్పా ల ని ముందుకు రాబోయాడు.

తలుపు చప్పుడు అయింది.

"నేను చెప్పాగా కానుక వచ్చింది" అంటూ పద్మ తలుపు తెరచి 'రండి డాక్టర్' అంది!

వచ్చిన సుధ ముందుకు అడుగు వెయ్యబోయి ఆగిపోయింది. చేతిలోని 'ప్రే మ లే ఖ లు' బొండు కిందపడిపోయింది.

అతని చేతిలోని మండుతూన్న అగ్గిపుల్ల ప్రేమలేఖల మీదపడి కాలిపోతున్నాయి.

"నేను ఇవ్వలేని ఆనందాన్ని పద్మ ఇచ్చింది డాక్టర్‌గా పనినే చూశాను కాని, మీ అభిరుచులను గ్రహించి మిమ్మల్ని ఆనందపరచలేకపోయాను— విష్ యూ ద బెస్టాఫ్ లక్ బై పద్మా! బై విజయ్!!" తల ఒంచుకొని గబగబా వెళ్ళిపోయింది సుధ.

ఇల్లుచేరి సావిట్లో కుర్చీలో వాలిన సుధకు కిటికీలోంచి ఆడుతూ ఎగురుతూన్న పిచుకల జంట కనిపించింది. ఆ పిచుకలను చూస్తూ కళ్ళు మూసుకుంది సుధ!

—